క్లుప్తంగా

పీహెచ్‌సీల్లో ప్రసవాలు సురక్షితం



గర్భిణులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఉష

సీతానగరం: గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవాలని, అప్పుడే తల్లీ బిడ్డ సురక్షితంగా ఉంటారని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు పి.ఉష అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు ప్రసవ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు ఉష మాట్లాడుతూ.. గర్భిణులు ప్రతీ నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అప్పుడే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని ముందుగా గుర్తించి తగిన చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ప్రసవ సమయంలో ముందుగా ఆస్పత్రిలో చేరడం వల్ల వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు. గ్రామంలోని ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, పీహెచ్‌ఎన్ సత్యవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో మతతత్వ రాజకీయాలు



పలగరలో ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

బలిజిపేట: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మతతత్వ రాజకీయాలను ప్రేరేపిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆరోపించారు. మండలంలోని పలగరలో శనివారం సీపీఎం జెండా ఆవిష్కరణ, పార్టీ మండలశాఖ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఆలోచించకుండా మతతత్వ రాజకీయాలను చేస్తోందని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, విజయవాడ వరదలు, విభజన చట్టం హామీలు, సూపర్‌సిక్స్ పథకాలు, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల వంటి సమస్యలపై దృష్టి సారించకుండా రాష్ట్రంలో మత వైషమ్యాలు సృష్టిస్తోందని ఆరోపించారు. ఇటువంటి విధానాలను మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రజలకు సురక్షిత తాగునీరు అందించలేకపోతున్నారు కానీ, మద్యం ఇష్టానుసారం విక్రయిస్తున్నారని ఎద్దేవా చేశారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదన్నారు. గ్రామాల్లో ప్రజలకు కల్పించాల్సిన మౌలిక వసతులపై దృష్టి సారించకుండా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారందిశగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేయాలన్నారు. అనంతరం మండల కమిటీ ఎంపిక జరిగింది. మండల కార్యదర్శిగా మన్మథరావు, కమిటీ సభ్యులుగా భానుమూర్తి, ఎస్.ఈశ్వరరావు, డి.త్రినాథ, బి.వెంకటస్వామి, జి.సత్యనారాయణ ఎన్నికయ్యారు.

14న ధర్నా

గుమ్మలక్ష్మీపురం: ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అన్ని మండలాల్లోని తహసీల్దారు కార్యాలయాల వద్ద ఈ నెల 14వ తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న నాయకులు.. ఇంటింటికీ వెళ్లి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసగిస్తున్న తీరును వివరిస్తున్నారు. ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలపై ఆర్థికభారం నెట్టే చర్యలు తీసుకుంటున్నారని చెబుతున్నారన్నారు.

అపార్‌కు ఆధార్ గ్రహణం

- అక్షరం తప్పున్నా నమోదుకు ఆటంకం
- వివరాలు సరిచేస్తేనే ప్రక్రియ వేగవంతం
- ఆధార్ కేంద్రాలకు విద్యార్థుల పరుగులు

పార్వతీపురం:

దేశ వ్యాప్తంగా విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ' (అపార్) నమోదుకు ఆధార్ వివరాలు ఆటంకంగా మారుతున్నాయి. ఆధార్ కార్డులో ఉన్న సమాచారం మేరకే అపార్ జారీ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు సంబంధించిన వివరాలు ఆధార్‌లో తప్పుల తడకగా ఉండడంతో ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. ముందుగా ఆధార్ వివరాలు సరిచేసి ఆ తరువాత అపార్ నమోదు చేపట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అపార్ నమోదు ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ఒక్కో పాఠశాలలో 40 శాతం నమోదు కూడా పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది.



ఆధార్ నమోదు కోసం వేచిఉన్న విద్యార్థులు

- **డిజిటల్ గుర్తింపు..**

నూతన విద్యా విధానం అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 'వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ' పేరిట ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు 'అపార్' జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థికి సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం నమోదై ఉంటుంది. దేశంలో ఎక్కడైనా చదవాలన్న, ఉపాధి అవకాశాలు పొందాలన్నా ఈ శాశ్వత డిజిటల్ గుర్తింపు సంఖ్య కీలకం కానుంది.

పాఠశాల, ఆధార్‌లోని వివరాలు సరిపోలకే..

ముఖ్యంగా ధ్రువపత్రాల రక్షణకు అవకాశం ఉంటుంది. అయితే విద్యార్థుల ఆధార్ వివరాల్లోని తప్పులతో అపార్ నమోదుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆధార్‌లో ఒక విధంగా, పాఠశాలలో మరోలా పేర్లు ఉండడంతో వాటిని మార్చడం సమస్యగా మారింది. చాలా మందికి ఆధార్ జారీ సమయంలో పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదు చేశారు. నెల, తేదీ సరిగా నమోదు చేయకపోవడంతో ఇబ్బందులు నెలకొన్నాయి. పాఠశాల, ఆధార్‌లోని వివరాలు సరిపోలినప్పుడే అపార్ నమోదవుతుంది. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, మొబైల్ నంబరు, తల్లి దండ్రుల పేర్లు, ఆధార్ సంఖ్యలో ఏదైనా తప్పుగా చూపినా నమోదు కావడం లేదు. పేరులో అక్షరాలు సైతం ఒకేలా ఉంటేనే ఆన్‌లైన్‌లో ముందుకెళ్లేందుకు అవకాశం ఉంటుంది. పాఠశాల రికార్డుల్లో నమోదైన సమాచారానికి ఆధార్ వివరాలకు పొంతన లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పుట్టిన తేదీ, పేర్లు, సెల్‌ఫోన్ నంబర్ పరంగా ఎక్కువగా తప్పులు దొర్లుతున్నాయి. ఆధార్‌లో ఉన్న అడ్రస్, పాఠశాల రికార్డుల్లోని చిరునామాలో తేడా ఉండటంతో ఈ ప్రక్రియ సజావుగా సాగడం లేదు.

వేగవంతం చేస్తున్నాం..



జిల్లాలో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) నమోదు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. 1 నుంచి 12వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేపడుతున్నాం. జిల్లాలోని విద్యార్థులకు అపార్ గుర్తింపు సంఖ్య కేటాయించే ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తాం. అపార్ నమోదుకు విద్యార్థులు కొంత అసౌకర్యానికి గురౌతున్నప్పటికీ భవిష్యత్తులో ఇది అన్ని రకాలుగా ఉపయోగపడుతుంది.

– నల్ల తిరుపతినాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

1 నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలు-విద్యార్థుల వివరాలు ఇలా..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	అపార్ నమోదు	పెండింగ్
సాలూరు	200	14403	8,719	5,684
సీతంపేట	175	11,232	6,869	4,363
బలిజిపేట	66	4,210	2,632	1,578
జియ్యమ్మవలస	102	4,840	3,027	1,813
పార్వతీపురం	148	16,635	10,634	6,001
భామిని	73	5,475	3,539	1,936
సీతానగరం	69	3,674	2,376	1,298
మక్కువ	89	5,055	3,440	1,615
కురుపాం	183	8,523	5,809	2,714
వీరఘట్టం	74	6,207	4,270	1,937
కొమరాడ	130	5,930	4,095	1,835
పాచిపెంట	127	7,287	5,088	2,199
గుమ్మలక్ష్మీపురం	183	9,360	6,815	2,545
గరుగుబిల్లి	61	4,445	3,436	1,009
పాలకొండ	81	9,670	7,990	1,680

- **ఆధార్ కేంద్రాలకు పరుగులు**

గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ వివరాలు సరి చేయడానికి తల్లిదండ్రులకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆధార్ పుట్టిన తేదీ సమస్య పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శి ఇచ్చే ధ్రువీకరణ పత్రం ఉంటేనే మార్పునకు అవకాశం ఉంటుంది. గ్రామాల్లో 80 శాతం జనన వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో నమోదు చేయడం లేదు. రెవెన్యూ శాఖ జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తేనే ఆధార్‌లో మార్పునకు అవకాశం ఉంటుంది. నవంబరు 30లోగా అపార్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం అపార్ కార్డు విద్యార్థులకు తప్పనిసరి కావడంతో ఆధార్‌లోని తప్పులను సరిచేయించుకునేందుకు తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని మండలాల్లో ఆధార్ కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో సుదూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆధార్ సమస్యతో అపార్ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని 1,761 పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1,16,946 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో 78,739 మంది విద్యార్థులకు సంబంధించి అపార్ నమోదు పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ధరల పెరుగుదలపై సీపీఎం పోరుబాట



పోరుబాట పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

సాలూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ప్రజలపై భారం మోపేందుకు చూస్తున్నాయని సీపీఎం నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 14 వరకు పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పోరుబాటపై ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీల సర్దుబాటుతో పేదలపై ఆర్థిక భారం పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. నిత్యావసర ధరలు తగ్గించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగులకు భృతి చెల్లించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ నాయకులు శ్రీను, సీతయ్య, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందే..

పార్వతీపురంటౌన్:

ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పట్టణ సీఐ నారాయణ రావు, ట్రాఫిక్ ఎస్సై పాపయ్య అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద శనివారం రహదారి భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవాలని, లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లల్లో ఆటోలను క్రమపద్ధతిలో నిలపాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, పాత బస్టాండ్, సౌందర్య జంక్షన్, బెలగాం వద్ద ఆటోలను అస్తవ్యస్తంగా నిలపడం వల్ల ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించొద్దని, డ్రైవర్ సీటులో ప్రయాణికులను కూర్చోపెట్టొద్దని సూచించారు.



పార్వతీపురంటౌన్: ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. మండలంలోని పెదభోగిలి ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి సిబ్బందితో కలిసి పర్యటించారు. రోడ్డు ప్రమాదాలకు కారణాలు, ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు, రోడ్డు భద్రత నిబంధనలపై స్థానికులకు అవగాహన కల్పించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, పరిమితికి మించిన వేగంతో ప్రయాణించడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్, ఫోర్‌వీలర్ డ్రైవర్లు సీటుబెల్ట్ కచ్చితంగా ధరించాలని సూచించారు. వాహన చోదకులు, ప్రజలు రహదారి భద్రత నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసపూరిత ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని సూచించారు. సైబర్ మోసాలపై 1930కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించడం, గుంతలు పూడ్చడం వంటి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని నారాయణ విద్యాసంస్థపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అఖిల్ డిమాండ్ చేశారు. పాఠశాలలకు రెండో శనివారం ప్రభుత్వ సెలవు దినమైనప్పటికీ పార్వతీపురంలో నారాయణ స్కూల్ తెరవడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు స్కూల్ వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ స్కూల్ తెరవాలని యాజమాన్యం నుంచి ఒత్తిడి ఉందని సిబ్బంది తెలపడంతో, తాము చదువుకు వ్యతిరేకం కాదని అధిక ఒత్తిడితో కూడిన చదువుకు వ్యతిరేకమని ఎస్ఎఫ్ఐ నాయకులు తేల్చి చెప్పారు. అన్ని విద్యాసంస్థలతో సమానత్వం పాటించాలని, వెంటనే పాఠశాలకు సెలవు ప్రకటించాలని డిమాండ్ చేయడంతో స్కూల్ యాజమాన్యం సెలవు ప్రకటించింది.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు అఖిల్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలలో ర్యాంకులనే పరమావధిగా భావించి విద్యార్థులను అధిక ఒత్తిడికి గురిచేయడం వల్ల వారు మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించేందుకే ప్రభుత్వం సెలవులను ప్రకటిస్తుందని, వాటిని పాటించకపోవడం నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. అటువంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.డేవిడ్, సురేష్, శ్రీను, అఖి, వెంకీ, రాజేష్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలోని తప్పులు సవరించుకోవాలి

గరుగుబిల్లి: ఓటరు జాబితాలో ఏవైనా తప్పులుంటే వాటిని సవరించుకోవాలని ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్ సూచించారు. మండలంలోని గొట్టివలస పోలింగ్ కేంద్రాన్ని శనివారం సందర్శించిన ఆయన బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండి, ఓటరు వివరాల్లోని తప్పులను వారి అభ్యర్థన మేరకు సరిచేయాలని తెలిపారు. మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎల్‌వో పి.శిరీష, తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులకు మోక్షం



రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన వెన్నెల బుచ్చింపేట బీటీ రోడ్డు నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయి. అంటిపేట జంక్షన్ నుంచి వెంకటాపురం మీదుగా వెన్నెల బుచ్చింపేట వరకు ఉన్న మెటల్ రోడ్డును బీటీరోడ్డుగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం రూ.1.35 కోట్లు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. బీటీ వేయడం మినహా పనులు పూర్తయ్యాయి. బీటీ వేసే సమయానికి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలయ్యాక ఈ రోడ్డు పనులకు మోక్షం వచ్చింది. ప్రస్తుతం పనులు శరవేగంగా చేపడుతున్నారు. నెలాఖరు నాటికి బీటీరోడ్డు పనులు పూర్తిచేస్తామని సంబంధిత అధికారులు చెపుతున్నారు.

పంట కోతలు ప్రారంభం



వెంకటాపురంలో వరిచేను కోతలో నిమగ్నమైన రైతులు

సాలూరు రూరల్: మండలంలో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది వరిసాగుకు వాతావరణం కొంత అనుకూలంగా ఉన్నప్పటికీ పంట చివరిదశలో కురిసిన వర్షాలకు పలుచోట్ల పంట దెబ్బలు దెబ్బతినడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కూర్మరాజుపేట, పరిసర గ్రామాల్లో పంటకు ఆఖరి నీటితడులు అందించేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. అనేక అవస్థలు ఎదుర్కొని సాగుచేసిన వరిపంట చివరకు చేతికి వస్తుండటంతో రైతులు ఆనందంగా ఉన్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.



కూర్మరాజుపేటలో వరిపంట కోస్తున్న రైతులు

ముమ్మరంగా వరి కోతలు

సీతానగరం: ఖరీఫ్ వరి పంటకోత పనులు ఊపందుకున్నాయి. పంటకోత, చేను కుప్పగా చేర్చడం, నూర్పిడి, వంటి పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. అయితే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దళారులు రంగంలో దిగి తక్కువ ధరకు ధాన్యం సేకరిస్తున్నారు. ఇప్పటికే సుమిత్రాపురం, పెదంకలాం, నిడగల్లు గ్రామాల్లో నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఇతర జిల్లాకు తరలించారు. తాజాగా గుచ్చిమి, వెంకటాపురం, రంగంపేట, కె.ఎస్.పురం, గాదెలవలస, దయానిధిపురం, గెడ్డలుప్పి, చినభోగిలి, ఆర్.వెంకంపేట, రామవరం తదితర గ్రామాల్లో రైతులు వరిచేను పనుల్లో నిమగ్నమయ్యారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఏఓ ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా.. ప్రస్తుతం వరికోతలు అవుతున్నాయని, నూర్పులు ప్రారంభమయ్యే సమయానికి కొనుగోలు చేపడతామని అన్నారు. ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.



గుచ్చిమిలో పొలంలో వేసిన వరికుప్పలు

సేవలకు సెలవు!

- ఆర్‌బీకేల్లో నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు
- కొత్త యాప్‌తో అరకొరగా సేవలు
- అన్నదాతకు తప్పని అవస్థలు



రైతుభరోసా కేంద్రంలో ఉన్న కియోస్క్

బలిజిపేట:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో అమలు చేసిన పలు పథకాల పేర్లను కూటమి ప్రభుత్వం వచ్చాక మార్చుచేసింది. సచివాలయ వ్యవస్థను, రైతుభరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు చూస్తోంది. రైతులకు వారు ఉన్న ఊర్లోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పాటు వారికి అవసరమైన సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు తమకు కావాల్సిన వ్యవసాయ ఉత్పాదకాలను నేరుగా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకువీలుగా కియోస్క్‌లను కూడా ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కియోస్క్‌ల వినియోగాన్ని రైతులకు దూరం చేయడం ద్వారా వాటిని నిరుపయోగంగా మార్చేందుకు చూస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

కియోస్క్ స్థానంలో యాప్..

రైతులకు కావాల్సిన ఎరువులు, యంత్రపరికరాలు, పశువుల దాణా, మార్కెటింగ్ వంటి అన్ని రకాల సేవలు ఆన్‌లైన్‌లో పొందేందుకు వీలుగా గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో కియోస్క్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యంత్రాల ద్వారా రైతులు తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను, యంత్రపరికరాలను ఆన్‌లైన్‌లో ముందుగానే నమోదుచేసుకునేవారు. ఆయా ప్రాంతాల్లోని వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, పంటల యాజమాన్య పద్ధతులపై సమాచారం, వీడియోల రూపంలో తెలుసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ సర్వర్లు పనిచేయకపోవడంతో సచివాలయ సేవలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి.

రైతుభరోసా కేంద్రాల్లో ఉండే కియోస్క్‌ల సేవలు స్థానంలో సీఎంఏఐడీ యాప్‌ను తీసుకొచ్చింది. దీని ద్వారా అరకొర సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. పూర్తిస్థాయిలో సేవలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు సంక్షేమ కోసం గత ప్రభుత్వం తీసుకొచ్చిన కియోస్క్ యంత్రాలను నిరుపయోగం చేయడం సరైన పద్ధతి కాదని పలువురు రైతులు అంటున్నారు.

కియోస్క్ సేవలు కొనసాగించాలి

రైతు సంక్షేమానికి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాలను కొనసాగించాలి. రైతుభరోసా కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో సేవలు అందేలా చూడాలి. ఎరువులు, పురుగు మందులు నమోదుతో పాటు, మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకునేందుకు కియోస్క్‌లు ఎంతగానో ఉపయోపడేవి. వాటి సేవలను కొనసాగించాలి.

– తిరుపతినాయుడు, పెదపెంకి, బలిజిపేట మండలం

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం..

రైతుభరోసా కేంద్రాలలో ఉండే కియోస్క్‌లను వాడుతున్నాం. రైతులకు అన్ని రకాల సేవలను అందిస్తున్నాం. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సేవలు అందిస్తాం.

– శ్రావణ్‌కుమార్‌నాయుడు, ఏఓ, బలిజిపేట